


"విన్నావా ఆ పకపకలు....నిన్నటివరకూ ఒకరి మీదొకరు దేగర్పు విసురుకుని కారమ్మూ, మిరియమ్మూ నూరుకున్న ఆ శత్రువర్గాలు రెండూ ఈవేళ చెప్పు ఆడేస్తూ నవ్వుల డూయట్ పాడేస్తున్నాయ్........ లోకంలో సిగ్గులేనితనం మరీ పెచ్చ్రేగిపోతోంది...." కలలోకూడా ఊహించని దారుణాన్ని కళ్ళారా చూసి విస్తుపోతున్నవాడిలా ఆశ్చర్యంగానూ, కొంచెం కోపంగానూ రామారావు ఒక చెయ్యి మిస్టర్ సంపత్ (ఇంటాయన) వాటాకేసి చూపి, రెండో చెయ్యి నడ్డి మీద పెట్టుకుని నాటకం ఫక్కీలో అన్నాడు.

చదూతున్న "డ్రీమ్స్ డై ఫస్టు"ని రాక్‌లోకి విసిరేసి కుతూహలంగా నేనూ కిటికీ దగ్గరకి మిస్టర్ సంపత్ వాటాకేసి చూసాను.

అవున్నిజంవే!

గొప్ప దారుణం జరిగిపోతోంది.

మీసాల్రావని మేం ముద్దుగా పిలిచే

ఇంటాయన (....వయసు ఒకటి తక్కువ నలభై. ఎత్తు ఓ అంగుళం తక్కువ ఐదడుగులు. వెడల్పు ఓ సెంటి మీటరు తక్కువ రెండడుగులు. ఆస్తి ఓ సెంటు తక్కువ వందెకరాలు) చదరంగం బల్లమీద పావుల్ని కదుపుతూ ఒకటో రెండో పావుల్ని ఎగరేసుకు పోతున్న గెద్దలా యమ హుషారుగా కుర్చీతో సహా ఊగిపోతూ నవ్వేస్తున్నాడు.

అరుణ ఆయన కెదురుగా మరో కుర్చీలో కుదుమట్టంగా కూర్చుని తన 36-24-35 ఎత్తులతో మిస్టర్ మీసాల్రావుని వెర్రెక్కిస్తూంది. అయన్ని నవ్వుల్లో ముంచేసి చదరంగంలో ఎత్తులమీద ఎత్తులు వేస్తూ త్రికమకాస్త్రం ప్రయోగిస్తోంది.

"ఇలా జరుగుతుందని మనం ఎప్పుడైనా అనుకున్నామా? సిగ్గు సిగ్గు" అని రామారావు యధాశక్తి నాటకం ఫక్కీతో చేతులు నెత్తిమీద పెట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు. (అది ఇనపది కాబట్టి సరిపోయింది.)

చెప్పొద్దూ రామారావు ఓవర్ యాక్షన్ నా కెంత మాత్రం రుచించలేదు.

"ఇలా జరుగుతుందని ముందుగా ఊహించబట్టే ఆ వ్యవహారంలో తల దూర్చకురా మిత్రమా అన్నాను. విన్నావా? ఇప్పుడు ఆశ్చర్యపోయి ఆలోచనల గొడ్డలితో బుర్ర చితగ్గొట్టుకుని చేసేదేముంది?" అని మందలించాను.

"ఒప్పేసుకున్నా మిత్రమా ఒప్పేసుకున్నా! బుద్ది గడ్డిమేసింది. ఇంకెప్పుడూ వాళ్ళ జోలికి పోను. బుర్ర వేడెక్కి ఒళ్లు స్టీమింజనయి పోయింది. ఓ సిగరెట్టిలా ముఖాన కొట్టు—" అన్నాడు రామారావు.

"అప్పుడే ఏం చూశావ్....ఆ ఆకస్మిక మిత్రవర్గాలు రెండూ మనకి శత్రువులవకపోతే చూడు—" అని సిగరెట్టు నిజంగానే రామారావు మొహాన కొట్టాను.

రామారావు ముఖం ఏడ్చేయడానికి సిద్ధపడుతూ కళ తప్పింది.

*　　*　　*

అదో "ఇంటి తగూ!"

రెండు వాటాల్ని కలిపే వరాండాకి పార్టీషన్ పెట్టి దాన్నో వాటాచేసి ఘనత వహించిన భారతీయ రైల్వేకు చెందిన చిరుద్యోగి చిదానందానికి అద్దెకిచ్చాడు మిస్టర్ సంపత్.

అతని పేరు చిదానందం అనబట్టి రిస పోయింది గాని లేకపోతే "ఆనందం" అనే పదానికి, చిదానందానికి బొత్తిగా సంబంధం లేకుండా పోయేది. కారణం!—

చిరుద్యోగి చిదానందానితో విధవప్పగారుంది. ఆవిడ కొడుకు పోలియో వచ్చి కాళ్లు పడిపోయి మంచం మీదున్నాడు.

చిదానందానికి—అతను చస్తే పీడ పోయిం దనుకుని హాయిగా బొట్టు చెరిపేసుకొనే ఓ వెర్రి పెళ్ళాం వుంది. మతిలేని ఆవిడ కన్న ముగ్గురు పిల్లల్లో ఒకమ్మాయికి ఎన్నేళ్ళనించి ఎదురుచూసినా నోటమ్మట "అమ్మా" అనే మాటయినా రాకుండా వుంది. చిదానందానికి వ్యధా సరిత్సాగరంలాంటి తనకుటుంబంలో డాల్ఫిన్స్‌నోస్ లాంటి కొండలా అరుణ అనే చెల్లెలుంది.

"నేను ఉక్కు ఫ్యాక్టరీ పైలాన్ స్థంభానైతే, నా చెల్లెలు అరుణ మా ఇంటికి డాల్ఫిన్స్ నోస్" అని గర్వంగా చిదానందం వీధిలోచెప్పుకోడానికి తగిన లక్షణాలు అరుణకున్నాయి. డాల్ఫిన్స్ నోస్ లాంటి అరుణకి అంతకన్నా వగరు, పొగరువున్న 'నోస్' వుంది. "లేడీ ఆఫ్ ది హౌస్" అరుణ చిదానందానికి అందమైన చెల్లెలు.

చిదానందాన్ని మినహాయించి ఇంట్లో అందర్నీ ఒక్క చూపుతో అదిలించి ఓ మూల కూర్చో బెట్టగల సత్తావున్న పైగ్రస్ అరుణ. (ఆమె కా సత్తాయే లేకపోతే — రోజూ స్కూటర్ మీద ఇంటికొచ్చి—"మీ అరుణని ప్రేమిస్తున్నానండీ — అరుణ లేందే బతకలేను. ఈ ఆస్తి డబ్బు, పెద్ద ఉద్యోగం, సంఘంలో హోదా ఇవన్నీ వృధా అనిపిస్తున్నాయి." అంటూ డైలాగులు చెప్పే ఓన్లీ సన్ ఆఫ్ ది బిజినెస్ మాగ్నెట్ రంజిత్‌ని ఎప్పుడో పెళ్ళాడవలసి వచ్చేది తల్లి పోరు

పడలేక!)

ఎవరెంతటి వారైనా డబ్బు లేకపోతే అంతంత మాత్రం బతుకులే బతక వలసి వస్తుం కదా!

అందుచేత చిరుద్యోగి చిదానందం, టైపిస్టు అరుణ సంపాదనతో ఆ కుటుంబం "టరన్ టర్టిల్" అనిపించుకోకుండా 'టర్టిల్'లా మెల్లగా పాకుతూ వస్తోంది.

ఆ కుటుంబానికి ముందు చవగ్గా ఇల్లు అద్దెకిచ్చి, కరుగ్గా మధ్యలో కాళీ చైమని సతాయిస్తున్నాడు మిస్టర్ సంపత్.

ఏంచూసి ఇచ్చాడోగాని మిస్టర్ సంపత్ అసలా వాటాని నెలకి 60 రూపాయలు (ఓన్లీ సిక్స్టీ రుపీస్)కే అద్దె కిచ్చాడు చిదానందం కుటుంబానికి.

ఏం చూసి చవగ్గా ఇల్లు అద్దెకిచ్చాడో చిదానందం ముందు కనుక్కోలేక పోయినా, తరువాత తెలుసుకున్నాడు.

అసలు మిస్టర్ సంపత్కీ, చిదానందం కుటుంబానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనడం ఆరోజునించే ప్రారంభమైంది.

ఆ కథాక్రమం బెట్టిదనిన — ఓ రోజు మిస్టర్ సంపత్ పిచ్చాపాటీ మాట్లాడుతూ అరుణ ప్రసక్తి తెచ్చాడు.

"చాలా అందంగా ఉంటుంది—ఎంత పొందిక? ఎంత సొగసు? — బీదపిల్ల అని ఎవ్వరూ అనుకోరు—అవునూ—వాడెవడు ఆ రంజిత్—? రోజూ స్కూటరుమీద వచ్చి పోతూ వుంటాడు. అరుణని పెళ్ళి చేసుకుంటానంటున్నాట్టగా-పోనీ పెళ్ళి చేసెయ్యరాదూ—అప్పుడేంటి — పెళ్ళయిం తరవాత ఎలాగూ వాళ్ళదారి వాళ్ళది — ఎలాగూ ఆశపడుతున్నాడు కాబట్టి వాడిదగ్గర్నించి నాలుగురాళ్లు ఒడుక్కోవాలంటే వెంటనే పెళ్ళి చెయ్యకూడదు. అహా మరోలా అనుకోకండిస్మీ! లోకం తీరు గురించి మాట్లాడుతున్నా—" అని అడగని కామెంట్సూ—సజషన్సూ పారేశాడు.

"పోన్లే చవగ్గా ఇల్లు అద్దె కిచ్చినవాడు—తగూ పెట్టుకుంటే కాళీ చైమంటాడు. ఎందుకొచ్చిన రొస్టు" అనుకున్న చిదానందం కోపాన్ని దిగమింగుకుని రాని నవ్వు ముఖానికి పులుముకున్నాడు.

కానీ మర్రోండు రోజులకి—

"మీ సిస్టర్ని మ్యారేజ్ చేసుకుంటానోయ్. రొండో పెళ్ళన్న మాటేగాని నాకేం తక్కువ? — మొన్ననే థర్టీఫైవ్ వెళ్ళి థర్టీసిక్స్ వచ్చాయి—" అనేశాడు మిస్టర్ సంపత్ చిదానందంతో.

"బాబూ! మేం పేదవాళ్ళమే. ఒప్పుకుంటాం—కానీ మా పేదరికం చూసి జాలిపడి అడగని తరుణోపాయాలు సెల వియ్యకండి. దయచేసి—" అని చిదానందం చేతులు జోడించాడు.

"అంటే మీరనేదేమి టసలు! ఆ రంజిత్ గాడికున్న వయసు లేక పోయినా నాకేం తక్కువ? వాడి నాన్నకిలా ప్రెస్సూ, కోళ్ళ ఫారాలూ, రైస్ మిల్లులూ, పిండిమరలూ లేకపోయినా వందెకరాలు పొలం వుంది. అనుభవించే యోగ్యత మొహాన లేక నావెళ్లాం రెండేళ్ళ క్రితం ఆసుపత్రిలో పురుడోసుకుంటూ పిండం తిరగబడి కన్ను మూయబట్టి రెండో పెళ్ళంటున్నా. పిల్లలా—పిచికలా.... ఎవరూ లేరు...." అని లీడింగ్ లాయర్లా "చిదానందం నువ్వు నాగురించి ఈ విధంగా ఆలోచించాలిస్మీ!" అని చెబుతున్నట్టు మాట్లాడాడు మిస్టర్ సంపత్.

వెంటనే వాళ్ళిద్దరి మధ్యనా నేలమీద ఎక్కడనించో గాలి కెగిరొచ్చి పడిన పచ్చగడ్డి భగ్గుమంది-చిదానందం విసిరిన సిగరెట్టు పీక వల్ల!

ఆ పచ్చ గడ్డిలా చిదానందం కూడా భగ భగ మన్నాడు—

"ఏమిటయ్యా నీ దాష్టకం?—ఏదో ఇల్లు అద్దెకిచ్చిన పెద్ద మనిషివి కదా అని ఊరుకొంటుంటే. నోటికొచ్చి నట్లల్లా మాట్లాడుతున్నావ్. కాస్త మర్యాద నేర్చుకో. అద్దెకున్నాం కదా అని అన్నిమాటలు పడం...." అన్నాడు.

చిదానందం భగ భగలకి ఇల్లు అద్దెకిచ్చిన

వాడి హోదాలో మిస్టర్ సంపత్ చిటపట మన్నాడు.

"ఏదో పేదవాళ్ళు కదా అని జాలిపడి 60 రూపాయలకే వాటా అద్దెకిచ్చాను. ఏం చూసుకుని నీ మిడిసిపాటు? ఇల్లు కళీచై—" అని అల్టిమేటమ్ పారేశాడు.

దానితో చిదానందం దళిత్ పాంథర్లా తిరగబడి దూరపు చుట్టమైన అడ్వకేట్ ని సలహా అడిగాడు.

చాలా కాలంగా కేసుల కొరతతో బాధపడుతున్న ఆ అడ్వకేటు చిదానందం తెచ్చిన కేసు వినీ వినగానే "కుక్క జెట్టీలు వర్ధిల్లాలి" అని మనసులో అనుకుని, "మిస్టర్ సంపత్ అనే దురహంకారి మీకు ఇల్లు అద్దెకిచ్చి తారీఖేదో కూడా చూసుకోకుండా మిమ్మల్ని వేపించుకు తింటున్నట్లు కొట్టడానికొచ్చినట్లూ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టండి. కోర్టులో కేసు ఫైట్ చేస్తామని పోలీసులకి గట్టిగా చెప్పండి. ఆ తరవాత నే చూసుకుంటాను—" అని మిస్టర్ సంపత్ మీకొక్కడు ఇక మీద నాకే శత్రువు అన్నట్టు మాట్లాడాడు.

ఆ మేరకు చిదానందం పోలీస్ రిపోర్టు ఇవ్వగానే పోలీస్ యాక్టులో సో అండ్ సో సెక్షన్ క్రింద సో అండ్ సో కేసు బుక్ చేశారు, మిస్టర్ సంపత్ మీద పోలీసులు. స్టేషనుకి పిలిపించారు. అందుమీద మిస్టర్ సంపత్ అగ్గిరాము డయిపోయి తన ఇంట్లో ఆరునెలల బట్టి అద్దెకున్న చిదానందం కుటుంబం ఒక్క నెలకూడా అద్దె చెల్లించిన పాపాన పోలేదని కౌంటర్ కేసుపెట్టాడు. "పెట్ట నివ్వండి కేసు —కోర్టులో తేల్చుకుంటాం—" అన్నాడు చిదానందం.

"ఏం తేలుస్తాడో నేను చూస్తాలెండీ—కేసు కోర్టుకు నివేదించండి—" అన్నాడు మిస్టర్ సంపత్.

రాజీ ప్రశ్న లేదంటే లేదన్నారు.

కోర్టులూ, ప్లీడర్లూ, విచారణలూ, వాయిదాలూ, ఆ తరవాత తలనొప్పులూ,అనాసిన్ లు, ఆస్ప్రిన్ లూ అవుర్ అమృతాంజనములూ అలా రొటీన్ అవుతున్నాయే తప్ప ఎప్పటికీ కేసు ఓ కొలిక్కి రాదు. తీర్పంటూ తేలదు.

ఈ కథ అంతవరకూ వచ్చిన తరువాత వెంకట్రావనే నేను, రామారావనే నా మిత్రుడూ ఆ ఇంట్లో అందమైన మెట్లకింద ఒంటి గది వాటాగా మార్చబడిన కారు గ్యారేజ్ లోకి నెలకి 60 రూపాయల అద్దెకి దిగడం జరిగింది.

మేం గదిలో యిలా దిగీ దిగగానే ఎక్కడ అపోజిషన్ లో చేరిపోతామో అనే కంగారుతో మిస్టర్ సంపత్ మమ్మల్ని తన పక్షం లాక్కోడానికి అనేక చిట్కాలు ఉపయోగించాడు. మేం వచ్చిన రెండోరోజునే మాకు కాఫీ ఆఫర్ చేయడం, మా నిరుద్యోగి రామారావుని చదూ సంధ్యలడిగి ఉద్యోగం వేయిస్తాననడం ఆ చిట్కాలలో ఒక భాగమే.

ఉద్యోగం యిస్తానన్న ఆశ చూపగానే రామారావు ఆలోచించకుండా యింటాయన కుడిభుజమైపోయి, చిదానందం అండ్ ఫామిలీ మీద నిష్కారణంగానే శత్రుత్వం పెంచుకున్నాడు. "మీకెందుకు సార్ సంపత్ గారూ ....మీరలా నిశ్చింతగా ఉండండి. మిస్టర్ చిదానందాన్ని, వాడి తలపొగరు చెల్లెల్ని పది రోజుల్లో ముప్పైమూడు చెరువుల నీరు తాగించి, ఇల్లు కాళీ చేయడమో, లేకపోతే మీతో రాజీకొచ్చి, కోర్టులో కేసు తాలూకు ఖర్చులు భరించడమో జరిగేట్టు చేస్తాను." అని మిస్టర్ సంపత్ కూర్చున్న కుర్చీ ఎదురుగా గల బల్లని ఘోరంగా గుద్ది శపథం చేసి 'నాటకం'లో తన వంతు పాత్ర తాను నిర్వహించడం ప్రారంభించాడు.

నాటకం ఆడుతున్నంతకాలం నాలుగొందల రూపాయల ఉద్యోగం రెక్కలు కట్టుకుని తన వైపు ఎగురుకుంటూ వచ్చేస్తోందనే రామారావు గట్టిగా నమ్మాడు. తోటి నిరుద్యోగ మిత్రులు పదిమందిని పోగేసి రాత్రిళ్ళు చిదానందం ఇంటి వాటాముందు లైటేసుకుని రాత్రిళ్ళు రెండు కొట్టేవరకూ పేకాడ్డం, తాగొచ్చిన వాళ్ళలా రష్యన్ యాక్సెంట్లో



మాట్లాడ్డం, వాళ్ళ యింటిముందే పక్కలు పరచుకుని భళ్ళున తెల్లవారినా ముసుగుతన్ని నిద్ర నటించడం, వాళ్ళడిగినా అడక్కపోయినా "ఈ వరండా యెవడి సొమ్మూ కాదు మూలగడానికి. ఇంటాయన పర్మిషన్ పుచ్చుకొనే పేకాడుతున్నాం, పడుకుంటున్నాం. మా యిష్టం...." అని అవాకూ చెవాకూ వాగడం సాగించాడు కొన్నాళ్ళు.

చిదానందం అండ్ ఫామిలీ సర్దుకుపోయారేగాని చీమ కుట్టినట్లు కూడా బాధపడలేదు. ఎదురుతిరగలేదు. యిల్లు కాళీ చేయలేదు. ముఖ్యంగా తగాదాకి మూలకారణమైన అరుణ ఈ నాటకంలో బిగించన కొప్పు, ముడిపడ్డ కళ్ళు, ఎగురుతున్న ముక్కుపుటాలతో హఠాత్తుగా రంగప్రవేశంచేసి "మీకు చెల్లెళ్లు లేరూ....అక్కలు లేరూ....మీరు మనుషులు కారూ....ఇలా వేధిస్తారా ఉత్తి పుణ్యాన...." అని రంకెలువేస్తూ క్లయిమాక్స్ ఇచ్చేస్తుందని పూర్ రామారావు, ఇంటాయన సంపత్ ఆశించిందంతా వట్టిదే అయ్యింది. అసలామె (కనీసం మూసిన కిటికీ సందులోంచయినా సరే) వీళ్ళ కంటపడలేదు.

దానితో మా రామారావు మిత్రబృందం, "చిదానందాన్ని కాళీ చేయించే ఉద్యమం" తీవ్రతరం చేశారు.

ఓ రోజు ప్రత్యక్షంగా దగుల్బాజీతనానికి దిగిపోయారు.

మిస్టర్ సంపత్ వెనకనించి చోద్యం చూస్తూ నిలబడగా, మా రామారావు చిదానందంతో యేదో చిన్న విషయంమీద తగాదా పెంచుకున్నాడు. మాటలు పెరిగి చేతులకి పోర్నొచ్చింది. కొట్లాట కూడా అయ్యింది. మొదటిసారి చెయ్యెత్తింది మా రామారావే!

అప్పుడు అరుణ యింట్లోనే ఉంది. కానీ కనీసం మెరుపుతీగలాగ యిలా మెరిసయినా వెళ్ళలేదు.

రామారావు మాత్రం ఆ రాత్రి "తన చేతి దెబ్బ రుచి చూసిన చిదానందం యిక యిల్లు కాళీ చేయడం, నాలుగొందల రూపాయల ఉద్యోగం తెల్లారేసరికి తన ఒళ్ళో వాలడం ఖాయం" అని కలలు కంటూ "ఓ. కె. సార్....ఫైనల్ డ్రాఫ్టింగ్ చేస్తున్నానండి.... పూర్తయిన వెంటనే ఫైలు మీదగ్గరికి పంపుతానండి" అంటూ పలవరింతలు పలవరించాడు-కాబోయే ఆఫీసరుతో మాట్లాడుతున్నట్టు కల గని.

కానీ తెల్లారేసరికి—

అంతవరకూ తెర వెనుకవున్న అరుణ హఠాత్తుగా, ఎవరూ ఊహించని విధంగా రంగ ప్రవేశంచేసి నాటకానికి అనుకోని ముగింపు నిచ్చేసింది.

చక్కగా తలంటు పోసుకుని జుట్టుని వదులుగా చెవులమీంచి గుండెల మీదికి వేసుకుని, మొఖానికి స్నో పౌడరు అద్ది కళ్ళకు నల్లటి కాటుక, ఒంటిమీద తెల్లటి టెర్రి వాయిల్ చీరతో పొద్దున్నే చెరువులో ఒళ్లు విరుచుకున్న కమలంలా తయారై మిస్టర్ సంపత్ మతి పోగొట్టింది.

వాడితో హఠాత్తుగా మాటకలిపి, చదరంగం ఆడుతూ, నవ్వుతూ, నవ్విస్తూ సమర్థవంతంగా వ్యవహారాన్ని తనకి అనుకూలంగా మలిచేసింది.

* * *

"అసలు సంపత్ గాడికి సిగ్గుందంటావా? ఒక పక్క వాళ్లని పీడించమని నన్ను ఉసిగొలిపి, మళ్ళీ వాళ్ళతోనే చేతులు కలుపుతాడా?—ఐనా ఆ అరుణమాత్రం పెళ్ళికెదిగిన పిల్ల—సిగ్గుండొద్దా—హఠాత్తుగా వెళ్ళి ఆ బట్టతల సంపత్ గాణ్ని కవ్వించి తనవైపు తిప్పుకుంటుందా? పైగా పల్లిగ్గానవ్వులా వాడితో కలిపి? ధూ—ధూ—" అని ఆవేశ పడ్డాడు రామారావు మళ్ళీ నాటకం ఫక్కీలో.

ఇంతవరకూ ఈ కథలో అంటీ ముట్టనట్లున్న నేను వెంటనే రంగంలోకి దిగిపోయి ఈ కథకి ఇంతటితో ముగింపు నిచ్చేసి "కథ ముగిసేముందు రామారావుకి జ్ఞానోదయం కలిగించవలసిందే—లాభంలేదు." అనే సదాశయంతో ఇలా అన్నాను.

"చూడు రామారావ్ — ఎవడి బతుకులు వాడివి. ఆ కుటుంబం పెద్ద కుటుంబం. 60 రూపాయలకి ఇల్లు ఈ హైదరాబాద్‌లో దొరికిందంటే దాన్ని వదులుకోడానికి వాళ్ళెలా సిద్ధపడతారు? కోర్టులో ఇంటాయన మీద కేసు పెట్టినా, నువ్వు నీమిత్ర బృందాన్ని వెంటేసుకుని అల్లరి పెట్టినా మౌనంగా భరించడం, ఇప్పుడీవేళ ఇంటివాడితో హఠాత్తుగా స్నేహానికి దిగడం వెనకవున్న విషాదం, అదే—పేదరికం మనిషిని వున్నకాస్త జాగా వదులుకోనివ్వదు." అన్నాను.

రామారావు బుద్ధిమంతుళ్ళా నేను చెప్పినదంతా విని బరువుగా నిట్టూర్చి నిమిషం పాటు మౌనం పాటించాడు. ఆ తరవాత హఠాత్తుగా సిగరెట్ ప్యాకెట్‌లోంచి గంటకు 60 మైళ్ళ వేగంతో ఓ సిగరెట్ లాగి నోట్లో పెట్టుకుని "యువార్ రైట్ గురూ! ముందే నువ్వు నాకీ పాఠం బోధిస్తే యింత వరకూ వచ్చేది కాదు. నేను వెర్రిమొహం వెయ్యవలసిన అవసరం లేకపోయేది. సరే ఏంచేస్తాం....ఇప్పుడైనా కాస్త జాగ్రత్తగా ఉంటా!....ఆ సంపత్ గాడు ఉద్యోగం యిచ్చిన్తరవాత ఇల్లు మారిపోదాం" అన్నాడు.

నేను పగలబడి నవ్వాను. "పిచ్చివాడా, ఇంకా సంపత్ యిప్పించబోయే ఉద్యోగంమీద ఆశతో ఉన్నావా? ఐపిటీయూ?" అని జాలి జాలిగా అన్నాను.

"ఏం?" అని రామారావు ఆశ్చర్యంగానూ కొంచెం దెబ్బతిన్నట్టుగానూ అడిగాడు.

"శత్రువర్గాలు రెండూ ఒకటవగానే, అందులో ఉన్న మూడో వర్గాన్ని బలిపెట్టడం ఈ ప్రపంచ గమన సూత్రం నాయనా?" అన్నాను నేనీసారి నాటకం ఫక్కీలో.

వెంటనే రామారావు మాట్లాడకుండా గదిలోంచి బైటకి వెళ్ళిపోయాడు—బహుశా కొత్త ఇల్లు వెతకడానికే కాబోలు!!! □